
**కథ**

# అభీష్టం

అధికార హోదావల్ల లభించే పేరు ప్రతిష్ఠలు నిర్దేశిత ప్రాంతానికి మాత్రమే పరిమితమౌతాయి. వృత్తి తోపాటు ప్రవృత్తిపరంగా ఏదైనా కళలో రాణించగలిగితే మాత్రం ఆ వ్యక్తి కీర్తి దిగంతాలకు విస్తరిస్తుంది.



ఎమ్.ఆర్.ఓ.గా పని చేస్తున్న కార్తీక్‌కి ఆ ఊళ్లోనే కాదు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వుంది. అందుకు కారణం అతగాడు మంచి సాహితీవేత్త కావడమే. దానికి తోడు సుమధురగానాలాపన చేసే సుస్మిత జీవిత భాగస్వామి కావడం అతడి అదృష్టం. తను హృద్యంగా రచనలు చేస్తే ఆమె తియ్యగా పాడుతుంది. సంగీత, సాహిత్యాల సంగమమే వారి దాంపత్యం.

ఒకరోజు సాయంత్రం దంపతులిద్దరూ పిక్చర్‌కెళుతూ రోడ్డువారగా స్కూటర్ పార్కు చేసి మల్లెపూలకోసం పూల దుకాణానికెళ్ళారు.

అంతలో వెనకనుంచి ఒక వ్యక్తి గభాలున సుస్మిత మెడలోని గొలుసులాగి పారిపోవడం గమనించి అతడిని వెంబడించాడు కార్తీక్.

ఆ వ్యక్తిని సిద్ధూగా గుర్తించి విస్మయానికి గురైంది సుస్మిత. అనూహ్యంగా అతడినా స్థితిలో చూసేసరికి గుండె ఆగినంతపనైంది. 'సిద్ధూ, దొంగా?' అనుకుంది లోలోన. ఉన్నపళంగా ఆమె ఆలోచనలు ఐదేళ్లు వెనక్కు మళ్ళాయి.

డిగ్రీ ఫైనలియరు చదూతున్న రోజుల్లో తనకు సిద్ధూతో పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా రూపుదిద్దుకోడానికి ఎంతోకాలం పట్టలేదు. అతడెవరో, ఏం చేస్తున్నాడో తెలుసుకోకుండానే అతడికి మనసిచ్చింది. సాయంత్రం తను మ్యూజిక్ కాలేజీ నుంచి వచ్చేటప్పుడు సిద్ధూ కలిసేవాడు. ఇరువురూ కాస్సేపు సరదాగా ఏ పార్కులోనో, ట్యాంకుబండ్ మీదో కూర్చుని మాట్లాడుకునేవారు.

బి.ఏ. పూర్తి అయిపోగానే కూతురుకి సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు మోహనరావు.

సిద్ధూని ప్రేమిస్తున్నట్లు ఇంట్లో ఎలా చెప్పాలో తెలీడం లేదు సుస్మితకి. అమ్మానాన్నలకు తను ఒక్కగాని ఒక్క సంతానం. ఎంతో గారాబంగా పెరిగింది. తనేమడిగినా తెచ్చిస్తాడు నాన్న. అడక్కుండానే అన్నీ అమర్చిపెడుతుంది అమ్మ. సిద్ధూని చేసుకుంటానంటే కన్నవాళ్ళు కాదనరన్న నమ్మకముంది. అయితే మనసులో మాటని బయటపెట్టకుంటే తన ఉద్దేశం వాళ్లకెలా తెలుస్తుంది? అప్పటికే తన ప్రమేయం లేకుండా రెండు పెళ్లిచూపులు జరిగిపోయాయి. తన అభీష్టం మేరకు ఏదో ఒకటి ఖాయం చేయాలనుకుంటున్నాడు నాన్న. అమ్మ కూడా తొందరపెడుతోంది. ఇక తాత్సారం చేయకూడదనుకుని నోరు విప్పింది సుస్మిత.

తను ఇష్టపడ్డవాణ్ణి చేస్తే పిల్ల సుఖపడుతుందనుకున్నాడు మోహనరావు. అనుకున్నదే తడవుగా సిద్ధూని పిలిపించి అతడి గురించి ఆరా తీసాడు.

తనకి మేనమామ తప్ప మరెవ్వరూ లేరని ఆయన బెంగుళూరులో బిజినెస్‌లో ఎప్పుడూ బిజీగా ఉంటాడని చెప్పాడు. దరిదాపుల్లో బంధువులెవరైనా ఉన్నారా అని అడిగితే అందుకు కూడా పెదవి విరవడంతో మొహం మాడ్చుకున్నాడు మోహనరావు. పిల్ల ఇష్టపడింది కదా అని ముక్కు మొహం తెలియని వాడికి తన కూతుర్ని ఎలా ఇచ్చేస్తాడు? ఏం చేయాలో తోచడంలేదతడికి. దాదాపు కామేశ్వరి పరిస్థితి అంతే.

వాళ్ళ మనసుల్ని అర్థం పట్టిన సిద్ధూ తన మేనమామ సెల్ నెంబరిస్తూ కావాలనుకుంటే తన గురించి విచారించవచ్చన్నాడు.

అతడిచ్చిన నెంబర్‌కి డయల్ చేసాడు మోహనరావు.

''హలో'' అవతలనుంచి పలకరింపు.

''ఐయామ్ మోహనరావు, ఎల్.ఐ.సి. ఫీల్డ్ ఆఫీసర్. సిద్ధూ మీ మేనల్లుడని మాకిప్పుడే తెలిసింది''

**దూరి వెంకటరావు**

''ఔనండి. వాడి అమ్మానాన్న చిన్నప్పుడే పోయారు. అప్పటి నుండి నేనే వాణ్ణి పెంచి పెద్ద చేసాను''

''సిద్దూ కూడా ఆ మాటే అని మీ నంబరిచ్చాడు. అందుకే ఫోన్ చేస్తున్నాను. విషయం ఏమిటంటే మా అమ్మాయిని అతడికిద్దామనుకుంటున్నాం. మీరోసారి ఇక్కడకొస్తే అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు''

''సారీ... మరోలా అనుకోకండి. ఇప్పటికిప్పుడు బయలుదేరి నేనక్కడికి రాలేను. వాడికిష్టమైతే నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. పెళ్లైన తర్వాత కావాలనుకుంటే మనం తీరిగ్గా కూర్చుని మాట్లాడుకోవచ్చు''

అంతలోనే ఫోన్ కట్టయింది.

''మీకు ముందే చెప్పాను. నాకోసం ఆయన తన వ్యాపారాన్ని వదిలేసి రాలేడని'' అన్నాడు సిద్దూ.

ఎందుకో అతడి మాటలమీద మోహనరావుకి గురి కుదరడంలేదు. ''సరే, నువ్వెళ్ళు. ఆలోచించి చెబుతాను'' అన్నాడు.

వెళ్ళిపోయాడు సిద్దూ.

''ఇంతకీ ఏమాలోచించారు సంబంధం చేద్దామా వద్దా?'' అడిగింది కామేశ్వరి.

''వద్దు కామేశ్వరి. మనకీ సంబంధం వద్దు. అతడెవరో ఏమిటో పూర్తిగా తెలుసుకోకుండా కేవలం వాడి మాట మీద బేసై పిల్లనెలా ఇచ్చేస్తాం?'' అన్నాడు మోహనరావు.

సిద్దూని అల్లుణ్ణి చేసుకోవడానికి తండ్రి సుముఖంగా లేకపోవడంతో కళ్ళనీరు నింపుకుంది సుస్మిత. సిద్దూకి ఎవరూ లేరన్న ఒకే ఒక కారణంగా సంబంధాన్ని వదులుకోవడం ఆమెకేమాత్రం నచ్చలేదు. అలా అని పెద్దల్ని ఎదిరించే మనస్తత్వం కాదామెది.

''నేను నిన్ను చేసుకోవడం మీవాళ్ళకేమాత్రం ఇష్టం లేదు. ఇంతకీ నీ ఉద్దేశమేమిటో చెప్పు'' సుస్మిత కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు సిద్దు.

మౌనం దాల్చింది సుస్మిత.

''నువ్వు నన్ను మనస్పూర్తిగా కోరుకుంటే నాతో లేచి వచ్చేయ్''

సిద్దూ మాటలకు 'అమ్మో' అంది అదిరిపడుతూ...''ఎందుకంత భయపడతావ్? మీ తల్లిదండ్రులకు నువ్వు ఒక్కగాని ఒక్క బిడ్డవి. నిన్ను వదిలి వాళ్ళు మాత్రం ఉండగలరా? నా మాట విని నాతో వచ్చేయ్ గుళ్లో దండలు మార్చుకుందాం. తర్వాత వాళ్ళే మన దారికొస్తారు'' అన్నాడు కన్విన్సింగా. మాట్లాడలేదు సుస్మిత.

ఆమె మౌనాన్ని అంగీకారంగా భావిస్తూ ''ఈరోజు రాత్రి సరిగ్గా పదకొండు గంటలకి మీ ఇంటి వద్దకొచ్చి నీకోసం ఎదురుచూస్తూ ఉంటాను. మరచిపోకు'' అన్నాడు సిద్దూ.

సరేనంది సుస్మిత. ఆనేళ ఆమె పుట్టిన రోజు. ఆ విషయం చెప్పి అతడిని ఐస్ పార్లర్‌కి తీసుకువెళదామనుకుంది. మాటల్లోపడి ఆ సంగతి మరచిపోయింది. ఇంట్లో అడుగుపెడుతూనే ''నీకోసం ఏం పట్టుకొచ్చానో చెప్పు'' ఊరిస్తున్నట్లన్నాడు మోహనరావు. ''కేక్ పట్టుకొచ్చి ఉంటారు. ఇవాళ దాని బర్త్‌డే కదా!'' అన్నది కామేశ్వరి నవ్వుతూ.

''ఉహుఁ! ముందు వీధి గుమ్మంవంక చూడండి'' అన్నాడు మోహనరావు.

ఆత్రంగా బయటకు చూసారు. ''స్కూటీ మోపెడ్'' గ్రే కలర్‌లో తళతళ మెరిసిపోతోంది.

''హేయ్'' ఎగిరి గెంతులేసింది సుస్మిత.

''పిల్ల పుట్టిన రోజు సందర్భంగా అది కోరుకున్న బండి పట్టుకొచ్చారన్నమాట'' అంటూ దానికి బొట్టు పెట్టి హారతి పట్టింది కామేశ్వరి.

''అలా ఒకసారి మీ ఫ్రెండ్సందరి ఇళ్ళకి తిరిగి రామ్మా'' అనునయంగా అన్నాడు మోహనరావు.

సుస్మిత ఆనందానికి అవధులు లేవు. మొన్న మాటల్లో తనకు మోపెడ్ ఉంటే బావుండునంది. నోట్లో మాట నోట్లో ఉండగానే బండి పట్టుకొచ్చేసాడు నాన్న. తనంటే ఎంత పిచ్చి ప్రేమ? తను కోరిందేదీ తండ్రి ఏనాడూ కాదనలేదు. మరి సిద్దూ విషయంలో ఆ చొరవెందుకు చూపడం లేదో అర్థం కావడం లేదు. బహుశా తనను ఏ ఇంజనీరుకో, డాక్టరుకో ఇవ్వాలనుకుంటున్నారేమో! అమ్మానాన్నల కలల్ని కల్లలు చేసి సిద్దూతో లేచిపోడానికి మనస్కరించడంలేదు. ఓ ప్రక్క కన్నవాళ్ళ ఎడల మమకారం మరోవంక కోరుకున్నవాడి అనురాగం. ఈ ఊగిసలాటలో ఎటూ తేల్చుకోలేని స్థితి.



## మరీ చోద్యం!

**తనుశ్రీ దత్తా ఈమధ్య ప్రేమలో పడిందని బాలీవుడ్‌లో గుసగుసలు బయల్దేరగానే ఆమె వెంటనే వాటిని కొట్టిపారేసింది. 'అసలు లవ్వాడ్డానికి నాకు తీరిక ఎక్కడుంది? సినిమాలతో బిజీగా వుంటేనూ. ఒకవేళ లవ్వాడేంత టైముంటే పీర్స్ బ్రాస్నన్ (జేమ్స్‌బాండ్ పాత్రధారి)నే లవ్వాడతా' అంటోంది తనుశ్రీ. బాగానే ఉంది కానీ జేమ్స్ బాండ్‌గారు తనుశ్రీని లవ్వాడ్డానికి రెడీ కావొద్దూ! అని ముక్కున వేలేసుకుంటున్నారు సినీజనాలు.**

అన్నట్లుగానే ఆ రాత్రి సెల్ మ్రోగితే 'హలో' అంది సుస్మిత.

''నేను సిద్దూని. నీ గురించి బండి పట్టుకొచ్చి మీ ఇంటిముందు నిలబడ్డాను. ఇంట్లో అంతా నిద్రపోతున్నారనే అనుకుంటాను. త్వరగా వచ్చేయి. నేనిక్కడ ఎక్కువసేపుంటే ఎవరైనా అనుమానిస్తారు'' అన్నాడు కంగారుగా.

''క్షమించు. ఇంట్లో చెప్పపెట్టకుండా నీతో లేచిపోయి రాలేను. వాళ్ళ అభీష్టానికి భిన్నంగా వ్యవహరించి వాళ్ళకు తలవంపులు తేలేను. నువ్వు నన్ను మనస్పూర్తిగా ప్రేమిస్తున్నవాడివే అయితే కనీసం మీ బంధువులెవరినైనా తీసుకొచ్చి మా పేరెంట్స్‌తో మాట్లాడించు'' అంది సుస్మిత.

ఏదో అనబోయాడు సిద్దూ. సుస్మిత స్విచ్ ఆఫ్ చేసింది. పెద్దల అంగీకారం లేకుండా ఆమె తనని చేపట్టదని సిద్దూకి తెలిసిపోయింది. అంతే, ఆరోజునుంచి అతడు కనుమరుగయ్యాడు.

సిద్దూ పూర్తిగా కనుమరుగవడంతో అతడి అంతర్యం సుస్మితకు అర్థమైపోయింది. దాంతో మరో ఆలోచన పెట్టుకోకుండా ఎడ్‌సెట్ రాసి బి.ఇడి. చేసింది. తదనంతరం యూనివర్సిటీలో చేరి పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీ తీసుకుంది. కాలం ఆమెను సిద్దూను పూర్తిగా మరచిపోయేలా చేసింది. తల్లిదండ్రుల అభీష్టం మేరకు తన అభిరుచులకు తగినవాడైన కార్తీక్‌ని పరిణయమాడింది.

''రాస్కెల్!.. తప్పించుకున్నాడు. పద పోలీసు స్టేషన్‌కెళ్ళి రిపోర్టిద్దాం'' అన్నాడు కార్తీక్ ఒగరుస్తూ వచ్చి.

''వద్దు. ఏ కంప్లైంటు ఇవ్వనక్కర్లేదు. పదండి పోదాం'' అంది సుస్మిత.

''అదేమిటలా అంటావ్. నగ పోయినందుకు నీకు బాధనిపించడం లేదా?'' అడిగాడు కార్తీక్.

'ఇప్పుడు పోయింది నగ మాత్రమే. కావాలంటే మళ్ళీ కొనుక్కోవచ్చు. అదే ఆ రోజు అనాలోచిత తొందరపాటు నిర్ణయం తీసుకుని వుంటే జీవితమే చేజారిపోయేది' అనుకుంది లోలోన.

☆